# వివాహం, విడాకులు మరియు దురాచారాలు

## ప్రసారం మరియు పంపిణీ చేయబడిన శుక్రవారం ప్రసంగం (ఖుత్బా)

## తేదీ: 7 రబీ అల్-ఆఖిర్ 1448 హిజ్రీ, 18 సెప్టెంబర్ 2026కి సమానం

అల్-హమ్దు లిల్లాహిల్-లజీ షర్రఫనా 'అలల్-ఉమమి బిల్ ఖుర్ఆనిల్-మజీద్, వ ఖవ్వమ బిహీ నుఫూసనా బైనల్-వ'ది వల్-వ'ఈద్, లా యఅతీహిల్-బాతిలు మిన్ బైని యద్దైహి వ లా మిన్ ఖల్ఫిహ్, తంజీలుమ్-మిన్ హకీమిన్ హమీద్, వ అష్హదు అల్-లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీక లహ్, షహాదతన్ యబ్ఘా జుఖ్రుహా 'అలత్-తఅబీద్, వ అష్హదు అన్న ముహమ్మదన్ 'అబ్దుహూ వ రసూలుహ్, సల్లల్లాహు 'అలైహి వ 'అలా ఆలిహీ వ అస్హాబిహీ ఉలిల్-ఫద్లి వత్-తస్దీద్, వ సల్లమ తస్లీమన్ కసీరన్ ఇలా యౌమిల్-మజీద్. {యా అయ్యుహల్లజీన ఆమనుత్-తఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహీ వ లా తమూతున్న ఇల్లా వ అంతుమ్ ముస్లిమూన్}.

ఓ ముస్లింలారా!

ఇస్లామీయ శరీఅత్ నిర్మించబడిన మౌలికమైన, సమగ్ర సూత్రాలలో ఒకటి–ప్రజలకు విషయాలను సులభతరం చేయడం, వారిపై ఉన్న కష్టాన్ని మరియు ఇబ్బందిని తొలగించడం. అందుకే, ఈ మహత్తరమైన సూత్రాన్ని స్పష్టంగా స్థాపించేందుకు పవిత్ర ఖుర్ఆన్ మరియు ప్రవక్త ﷺ సున్నత్‌లో అనేక ఆధారాలు వరుసగా వచ్చాయి.

ఇస్లాం మనిషిని అనవసరమైన భారాలతో కుంగదీయడానికి వచ్చిన ధర్మం కాదు; అతని జీవితాన్ని సులభతరం చేసి, అతని శక్తికి మించిన బాధ్యతలను అతనిపై మోపకుండా, ధర్మాన్ని ఆచరించే మార్గాన్ని సుగమం చేయడానికి వచ్చిన ధర్మం. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

{يُرِيدُ اللَّهُ بِكُمُ الْيُسْرَ وَلَا يُرِيدُ بِكُمُ الْعُسْرَ} [البقرة: 185]

అల్లాహ్ మీకు సౌలభ్యం చేకూర్చదలిచాడుగాని, మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయాలని భావించడంలేదు. అల్లాహ్ ఇలా ప్రవచించాడు:

{وَمَا جَعَلَ عَلَيْكُمْ فِي الدِّينِ مِنْ حَرَجٍ} [الحج: 78]

ధర్మంలో ఆయన మీకు ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు.

**ఓ ముస్లింలారా!**

ప్రవక్త ముహమ్మద్ ﷺ వారి జీవన విధానం కూడా ఈ మహత్తరమైన సూత్రంపైనే ఆధారపడి ఉండేది. ఆయనకు రెండు విషయాల్లో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం వచ్చినప్పుడు, అది పాపకార్యం కానంతవరకు, వాటిలో సులభమైనదానినే ఎంచుకునేవారు.

ఈ సూత్రం ఆరాధనలు, లావాదేవీలు వంటి అన్ని విషయాల్లో వర్తిస్తే, కుటుంబ వ్యవహారాల్లో ఇది మరింత ప్రాధాన్యమైనది, మరింత అవసరమైనది. ఎందుకంటే కుటుంబమే సమాజానికి పునాది.

కుటుంబ జీవితంలో శరీఅత్ చూపించిన సులభత చోటుచేసుకున్న కొద్దీ– ఇళ్లు ప్రశాంతంగా, స్థిరంగా ఉంటాయి; వివాహం సులభమవుతుంది; వివాహానికి సంబంధించిన ఆర్థిక భారం తగ్గుతుంది; విడాకులు సంభవించినా, ఇరుపక్షాల హక్కులు కాపాడబడతాయి.

అయితే ప్రజలు శరీఅత్ చూపిన మార్గదర్శకత్వానికి బదులుగా కృత్రిమమైన ఆచారాలు, అనవసరమైన సంప్రదాయాలు, బయట నుంచి వచ్చిన భారమైన పద్ధతులను అనుసరించడం ప్రారంభిస్తే, సులభత కష్టంగా మారుతుంది.అప్పుడు అల్లాహ్ ప్రశాంతత, ప్రేమ, అనురాగాలకు కారణంగా చేసిన వివాహమే, కష్టాలకు, వివాదాలకు, కుటుంబ కలహాలకు కారణమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

**ఓ విశ్వాసులారా!**

ఇది ఎంతో బాధాకరమైన విషయం. కొంతమంది జీవితాలను ఇక శరీఅత్ ఆదేశాలు అంతగా నడిపించడం లేదు; సమాజంలోని ఆచారాలు, సంప్రదాయాలే వారిని ఎక్కువగా నడిపిస్తున్నాయి.

ఎంత విచారకరమంటే–కొన్ని ఆచారాలు తప్పు అని తెలిసినప్పటికీ, అవి వక్రీకృతమైనవైనా, శరీఅత్ బోధనలకు విరుద్ధమైనవైనా, కేవలం "ప్రజలందరూ ఇలానే చేస్తున్నారు" అనే కారణంతో వాటికి శరీఅత్ ఆధారాలకంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వింత కాదా?! అసలు సత్యానికి కొలమానం ప్రజలు ఏం చేస్తున్నారు అనేదేనా? ప్రజల ఆచరణే సత్యానికి ప్రమాణమా? లేదా అల్లాహ్ గ్రంథం మరియు ఆయన ప్రవక్త ﷺ వారి మార్గదర్శకత్వమే సత్యానికి అసలైన ప్రమాణమా?ముస్లిం తన జీవితాన్ని సమాజపు ఒత్తిళ్లకు అనుగుణంగా కాకుండా, అల్లాహ్ ఆదేశాలకు మరియు ప్రవక్త ﷺ సున్నత్‌కు అనుగుణంగా మలచుకోవాలి.

**ఓ విశ్వాసులారా!**

కొందరు ప్రజలను ధర్మాదేశాలకంటే సమాజ ఆచారాలే ఎక్కువగా శాసిస్తుండటం ఎంతో విచారకరం. చివరికి కొన్ని చెడు మరియు దారి తప్పిన ఆచారాలు, ఇవి సమాజంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయనే సాకుతో ధర్మాదేశాలకంటే ముందే నిలబడుతున్నాయి. ఆశ్చర్యం! సత్యానికి ప్రామాణికం ప్రజల ఆచరణేనా? అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

وَإِنْ تُطِعْ أَكْثَرَ مَنْ فِي الْأَرْضِ يُضِلُّوكَ عَنْ سَبِيلِ اللَّهِ إِنْ يَتَّبِعُونَ إِلَّا الظَّنَّ وَإِنْ هُمْ إِلَّا يَخْرُصُونَ [الأنعام: 116]

ముహమ్మద్ (స)! నీవు భూవాసుల్లోని అధిక సంఖ్యాకులు చెప్పే మాటలు గనక వింటే వారు నిన్ను దైవమార్గంనుండి తప్పిస్తారు. వారు కేవలం ఊహాలోకంలో విహరిస్తూ నిరాధారమైన విషయాలు అనుసరిస్తారు. అప్పుడు కొంతమంది ప్రజలు సున్నత్‌కు విరుద్ధంగా నడుచుకోవడాన్ని భయపడాల్సిన దానికంటే, ప్రజలు ఏమంటారో అన్న భయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు.

అందుకే వారిలో కొందరు ఇలా అంటారు: "ఇది అనవసరమైన ఆడంబరమే అని నాకు తెలుసు. అయినా ఏం చేయాలి? ప్రజలు ఏమంటారు?"ఇలా క్రమంగా ప్రజల అభిప్రాయమే కుటుంబాలపై తీర్పు చెప్పే అధికారంగా మారిపోతుంది. ఇది ఎంత ప్రమాదకరమైన పరిస్థితి!

ఈ విషయాన్ని గురించి అబూ నుఐమ్ తన అల్-హిల్యా గ్రంథంలో అబ్దుల్లాహ్ ఇబ్ను మస్ఊద్ رضي الله عنه గారి మాటలను ఉటంకించారు. ఆయన ఇలా అన్నారు:

«لَا يَكُونُ أَحَدُكُمْ إِمَّعَةً»

"మీలో ఎవరూ 'ఇమ్మఅహ్'గా ఉండకూడదు."

ప్రజలు అడిగారు: "అబూ అబ్దుర్రహ్మాన్! 'ఇమ్మఅహ్' అంటే ఏమిటి?" ఆయన సమాధానమిచ్చారు:

«أَنَا مَعَ النَّاسِ؛ إِنِ اهْتَدَوْا اهْتَدَيْتُ، وَإِنْ ضَلُّوا ضَلَلْتُ»

"నేను ప్రజలతోనే ఉంటాను. వారు సన్మార్గంలో ఉంటే నేనూ సన్మార్గంలో ఉంటాను; వారు మార్గభ్రష్టులైతే నేనూ మార్గభ్రష్టుడినవుతాను" అని చెప్పే వ్యక్తి. తర్వాత ఆయన హెచ్చరిస్తూ ఇలా అన్నారు:

«أَلَا لِيُوَطِّنَنَّ أَحَدُكُمْ نَفْسَهُ عَلَى إِنْ كَفَرَ النَّاسُ أَلَّا يَكْفُرَ»

"ప్రజలందరూ అవిశ్వాసానికి లోనైనా, తాను మాత్రం అవిశ్వాసానికి లోనుకాకుండా నిలబడేలా ప్రతి ఒక్కరూ తన మనసును సిద్ధం చేసుకోవాలి."

**ఓ విశ్వాసులారా!**

ముస్లిం తన జీవితానికి ప్రమాణంగా "ప్రజలు ఏమంటారు?" అనే ప్రశ్నను కాకుండా, "అల్లాహ్ ఏమి ఆదేశించాడు? ప్రవక్త ﷺ ఏమి బోధించారు?" అనే ప్రశ్నను చేసుకోవాలి. ప్రజల ప్రశంసలు ఈరోజు ఉంటాయి–రేపు ఉండకపోవచ్చు. కానీ అల్లాహ్ ప్రసన్నత శాశ్వతమైనది.

కాబట్టి సమాజపు ఒత్తిళ్లకు, ఆడంబరమైన సంప్రదాయాలకు, "ఇతరులు ఏమనుకుంటారో" అనే భయానికి లొంగకుండా, ఖుర్ఆన్ మరియు సున్నత్ చూపించిన సులభమైన, పవిత్రమైన మార్గాన్ని అనుసరించడమే ముస్లిం గౌరవం.

**ఓ విశ్వాసులారా!**

అల్లాహ్, భర్తపై మహర్ చెల్లించడాన్ని అనివార్యం చేశాడు మరియు దానిని భార్య యొక్క పూర్తి హక్కుగా చేశాడు. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

وَآتُوا النِّسَاءَ صَدُقَاتِهِنَّ نِحْلَةً فَإِنْ طِبْنَ لَكُمْ عَنْ شَيْءٍ مِنْهُ نَفْسًا فَكُلُوهُ هَنِيئًا مَرِيئًا [النساء: 4]

స్త్రీలకు లభించవలసిన మహర్ ను (విధిగా భావించి) వారికి సంతోషంగా ఇచ్చివేయండి. అయితే వారు సంతోషంగా కొంత మహర్ మాఫీ చేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు.

కొన్నిసార్లు **మహర్‌తో పాటు** భార్య మనసును సంతోషపరచడం, ఆమెకు ఆనందాన్ని కలిగించడం కోసం కొన్ని సాధారణమైన కానుకలను కూడా ఇస్తారు. అవి బట్టలు, ఆభరణాలు, సుగంధ ద్రవ్యాలు మొదలైనవి కావచ్చు. మన సమాజాల్లో వీటినే సాధారణంగా **"దజ్జా"** అని పిలుస్తారు.

అయితే, నేడు దజ్జా తన అసలు ఉద్దేశం నుండి దూరమై, మన సమాజాల్లో అనుకూలం కాని రూపాన్ని సంతరించుకుంది. ఒకప్పుడు సరళంగా, సహజంగా ఉండే ఈ ఆచారం క్రమంగా **ఆడంబరానికి, పోటీతత్వానికి, పరస్పర గొప్పలు చెప్పుకోవడానికి, ప్రదర్శనకు** వేదికగా మారింది.

దీని కారణంగా కుటుంబాల మధ్య బాహ్య ఆడంబరాల్లో పోటీ పెరిగింది. అవసరం లేని విషయాల్లో **అనవసరమైన ఖర్చులు, కృత్రిమ ఆడంబరాలు, భారం మోపే సంప్రదాయాలు** విస్తరించాయి.

ఇలాంటి ఆచారాలు **సరళతను పాటించమని ప్రోత్సహించే, వృథా ఖర్చును మరియు అహంకారాన్ని నిరోధించే, ప్రజల మధ్య గొప్పలు చెప్పుకోవడం మరియు ఆడంబర ప్రదర్శనకు తావులేకుండా చేసే ఇస్లామీయ బోధనలకు విరుద్ధంగా ఉంటాయి.**

ఆయిషా (రదియల్లాహు అన్హా) గారి ద్వారా ఉల్లేఖించబడింది. ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా సెలవిచ్చారు: "స్త్రీకి శుభప్రదమైన విషయాల్లో ఒకటి —— ఆమె వివాహ ప్రస్తావన సులభంగా జరగడం, ఆమె మహర్ సులభంగా ఉండడం, అలాగే ఆమె ప్రసవం సులభంగా జరగడం."

(అహ్మద్; అల్బానీ رحمه الله దీనిని హసన్‌గా పేర్కొన్నారు)

**విశ్వాసులారా!**

మన కాలంలో ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచుతున్న విషయాల్లో ఒకటి వివాహానికి ముందు, వివాహం తర్వాత నిర్వహించే అనేక రకాల వేడుకలు. వివాహం పూర్తయిందో లేదో, వెంటనే ఒకదాని తర్వాత మరొక కార్యక్రమం మొదలవుతుంది. వరుసగా విందులు, వేడుకలు, ఇతర కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి.చివరికి వివాహం అనేది ఒకదాని వెంట మరొకటి వచ్చే ఖర్చుల పరంపరగా మారిపోతుంది.

ఇక్కడ సమస్య సంతోషాన్ని వ్యక్తం చేయడంలో గానీ, వివాహ ఆనందాన్ని పంచుకోవడంలో గానీ లేదు. సంతోషాన్ని వ్యక్తం చేయడం ఇస్లాంలో అనుమతించబడినదే. అసలు సమస్య ఏమిటంటే – అవసరానికి మించి ఆడంబరాలు చేయడం, విపరీతంగా ఖర్చు చేయడం, ప్రతి కార్యక్రమాన్నీ ఒక తప్పనిసరి సామాజిక సంప్రదాయంగా మార్చడం.

ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించలేకపోతే, సమాజం వారిని ఇబ్బందికి గురిచేసే పరిస్థితి ఏర్పడకూడదు. కానీ నేడు కొన్నిచోట్ల పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. ఒక కుటుంబం చేసిన వేడుకను చూసి మరో కుటుంబం కూడా అంతకంటే ఎక్కువగా చేయాలనే పోటీ మొదలవుతోంది.

ఈ విధంగా, ఇస్లాం సులభంగా, సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్న వివాహం కుటుంబాలను ఆర్థికంగా కుంగదీసే భారంగా మారుతోంది. ఫలితంగా యువత వివాహాలు ఆలస్యమవుతున్నాయి. అంతేకాకుండా, అవసరం లేని అప్పుల ఊబిలో కుటుంబాలు చిక్కుకుపోతున్నాయి.

అందువల్ల వివాహాన్ని ఆడంబరాల ప్రదర్శనగా కాకుండా, సంతోషకరమైన కొత్త జీవితానికి శ్రీకారంగా మార్చుకోవాలి. వివాహంలో సంతోషం ఉండాలి; కానీ ఆ సంతోషం కుటుంబాలపై ఆర్థిక భారంగా మారకూడదు. సరళత, సౌలభ్యం, పరస్పర సహకారం – ఇవే వివాహాన్ని అందంగా, ఆశీర్వాద మయంగా మార్చే మార్గాలు.

అనస్ (రదియల్లాహు అన్హు) గారి ద్వారా ఉల్లేఖించబడింది: ప్రవక్త ముహమ్మద్ ﷺ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రదియల్లాహు అన్హు) గారి వద్ద పసుపు రంగు ఆనవాళ్లు కనిపించడాన్ని గమనించి, “ఇది ఏమిటి?” అని అడిగారు. అందుకు ఆయన, “నేను ఒక స్త్రీని బంగారంతో ఒక నాత్ బరువుకు సమానమైన మహర్ ఇచ్చి వివాహం చేసుకున్నాను” అని చెప్పారు.

అప్పుడు ప్రవక్త ﷺ ఇలా దుఆ చేశారు: “అల్లాహ్ నీకు శుభాన్ని ప్రసాదించుగాక! కనీసం ఒక గొర్రెను జిబహ్ చేసి  అయినా వలీమా చేయి.” (బుఖారీ, ముస్లిం)

నేను చెప్పిన ఈ మాటలతో పాటు మరెన్నో విషయాలను మీకు గుర్తుచేశాను. నా కోసం, మీ కోసం అల్లాహ్‌ను క్షమాపణ కోరుతున్నాను. కాబట్టి మీరు కూడా ఆయనను క్షమాపణ కోరండి. నిశ్చయంగా ఆయన అత్యంత క్షమాశీలుడు, అపార కరుణామయుడు.

## రెండవ ఖుత్బా

అల్-హమ్దు లిల్లాహి 'అలా ఇహ్సానిహ్, వష్-షుక్రు లహూ 'అలా తౌఫీఖిహీ వమ్తినానిహ్, వ అష్హదు అల్-లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీక లహూ త'జీమన్ లిషఅనిహ్, వ అష్హదు అన్నా ముహమ్మదన్ 'అబ్దుహూ వ రసూలుహుద్-దా'ఈ ఇలా రిద్వానిహ్, స్వల్లల్లాహు 'అలైహి వ సల్లమ వ 'అలా ఆలిహీ వ అస్హాబిహీ వ ఇఖ్వానిహ్.

**ఆ తర్వాత...**

అల్లాహ్ దాసులారా! అల్లాహ్‌కు భయపడుతూ, ఆయన పట్ల తక్వాను పాటించండి. ఎందుకంటే అల్లాహ్ తక్వాలోనే దాసుల నిజమైన సంతోషం ఉంది. పరలోక ప్రయాణం కోసం మనిషి సమకూర్చుకునే సంపదల్లో తక్వానే అత్యుత్తమమైనది.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَلْتَنْظُرْ نَفْسٌ مَا قَدَّمَتْ لِغَدٍ وَاتَّقُوا اللَّهَ إِنَّ اللَّهَ خَبِيرٌ بِمَا تَعْمَلُونَ

“విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. ప్రతి వ్యక్తి రేపటి కోసం తాను ఏమి సిద్ధం చేసుకున్నాడో చూసుకోవాలి. అల్లాహ్‌కు భయపడండి. నిశ్చయంగా మీరు చేసే పనులన్నింటినీ అల్లాహ్ బాగా ఎరిగినవాడు.” [అల్-హష్ర్: 18]

**ముస్లింలారా!**

వివాహ వ్యవహారాల్లోకి బయటి నుంచి వచ్చిన కొన్ని ఆచారాలు చొరబడి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపినట్లే, విడాకుల విషయంలో కూడా కొత్తగా పుట్టుకొచ్చిన కొన్ని ఆచారాలు విడాకుల అసలు శరీఅత్ ఉద్దేశాన్ని దెబ్బతీశాయి.

ఇస్లాంలో అవసరం ఏర్పడినప్పుడు విడాకులు అనుమతించబడినప్పటికీ, అవి ఒకప్పుడు ప్రేమ, అనురాగం, కరుణలపై నిర్మితమైన వైవాహిక బంధానికి ముగింపు. అందుకే విడాకుల విషయంలో కూడా ఇస్లామీయ శరీఅత్ కొన్ని మర్యాదలను నిర్దేశించింది. అవి మనిషి గౌరవాన్ని కాపాడాలి, హక్కులను పరిరక్షించాలి, పగ తీర్చుకోవడం మరియు ప్రతీకారం వంటి భావాలకు తావివ్వకూడదు.

ఈ విషయంలో ఇటీవల కనిపిస్తున్న అత్యంత అసహ్యకరమైన ఆచారాల్లో ఒకటి “విడాకుల వేడుక” పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం.

ఒక్కసారి ఆలోచించండి!

ఒక క్షణం... అందులో ఎంతో బాధ ఉంది.

ఒక కుటుంబం విడిపోతోంది.

పిల్లల జీవితాలపై దాని ప్రభావం పడుతోంది.

అలాంటి బాధాకరమైన సందర్భాన్ని వేడుకగా మార్చి, సంతోషాన్ని ప్రదర్శించడం ఎలా సమంజసం?

ఒక ముస్లిం కుటుంబం విచ్ఛిన్నం కావడాన్ని సంతోషించాల్సిన విషయంగా భావించడం ఇస్లామీయ విలువలకు ఎలా అనుకూలంగా ఉంటుంది?

ఇది విడిపోవాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు కూడా మర్యాదగా, మంచితనంతో వ్యవహరించాలని ఆదేశించిన శరీఅత్ ఉద్దేశాలకు విరుద్ధమైనది.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

فَإِمْسَاكٌ بِمَعْرُوفٍ أَوْ تَسْرِيحٌ بِإِحْسَانٍ

“లేదా మంచి విధంగా భార్యను తన వద్ద ఉంచుకోవాలి; లేదా మంచితనంతో ఆమెను విడిచిపెట్టాలి.”

[అల్–బఖరహ్: 229]

కాబట్టి విడాకులను ఆర్భాటమైన, హంగామా చేసే కార్యక్రమాలతో స్వాగతించడం మంచితనం కాదు. అవతలి వ్యక్తిని బాధపెట్టడం, అతని/ఆమె మనసును గాయపరచడం, పాత కక్షలను మళ్లీ రగిలించడం కూడా మంచితనం కాదు.

అసలు సరైన మార్గం ఏమిటంటే – జీవితంలోని ఈ అధ్యాయం ముగిసినప్పుడు దానిని మర్యాదతో, గోప్యతను కాపాడుతూ, పరస్పర హక్కులను పరిరక్షిస్తూ, పిల్లల పట్ల కరుణతో ముగించాలి.

ఇబ్లీస్‌కు ఎంతో ఇష్టమైన పని – ముస్లిం సమాజాన్ని ఆలోచింపజేసే ఒక ముఖ్యమైన హదీసును గమనించండి. జాబిర్ (రదియల్లాహు అన్హు) గారి ద్వారా ఉల్లేఖించబడింది. ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా సెలవిచ్చారు:

»إِنَّ إِبْلِيسَ يَضَعُ عَرْشَهُ عَلَى الْمَاءِ، ثُمَّ يَبْعَثُ سَرَايَاهُ، فَأَدْنَاهُمْ مِنْهُ مَنْزِلَةً أَعْظَمُهُمْ فِتْنَةً، يَجِيءُ أَحَدُهُمْ فَيَقُولُ: فَعَلْتُ كَذَا وَكَذَا، فَيَقُولُ: مَا صَنَعْتَ شَيْئًا، قَالَ: ثُمَّ يَجِيءُ أَحَدُهُمْ فَيَقُولُ: مَا تَرَكْتُهُ حَتَّى فَرَّقْتُ بَيْنَهُ وَبَيْنَ امْرَأَتِهِ، قَالَ: فَيُدْنِيهِ مِنْهُ وَيَقُولُ: نِعْمَ أَنْتَ». قَالَ الْأَعْمَشُ: أُرَاهُ قَالَ: «فَيَلْتَزِمُهُ».«

“నిశ్చయంగా ఇబ్లీస్ తన అర్ష్ నీటిపై ఏర్పాటు చేసుకుంటాడు. తరువాత తన సైనిక బృందాలను పంపిస్తాడు. వారిలో ప్రజలను ఎక్కువగా కలవరపెట్టి, పెద్ద ఎత్తున ఫిత్నాకు గురిచేసినవాడే అతనికి అత్యంత సన్నిహితుడు. వారిలో ఒకడు వచ్చి, ‘నేను ఇలా చేశాను, అలా చేశాను’ అని చెబుతాడు. అప్పుడు ఇబ్లీస్, ‘నువ్వేమీ చేయలేదు’ అని అంటాడు. తరువాత మరొకడు వచ్చి, ‘నేను అతడిని అతని భార్య నుంచి విడదీసే వరకు అతడిని వదల్లేదు’

అని చెబుతాడు. అప్పుడు ఇబ్లీస్ అతడిని తనకు దగ్గరగా తీసుకుని, 'నువ్వు చాలా గొప్ప పని చేశావు!' అని అంటాడు." అల్-అఅ్‌మష్ رحمه الله ఇలా అన్నారు: "అతడు అతడిని తనకు హత్తుకున్నాడని నేను భావిస్తున్నాను." [సహీహ్ ముస్లిం]

**అల్లాహ్ దాసులారా!**

ఇబ్లీస్ అంతలా  ఇష్టపడే ఒక పనిని మనిషి ఎలా వేడుకగా జరుపుకోగలడు?!

భర్తను భార్య నుంచి విడదీయడం, ఒక కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడం ఇబ్లీస్‌కు అంత ఇష్టమైన పని అయితే, దానిని మనం సంతోషోత్సవంగా ఎలా మార్చగలం? అయితే, అల్హమ్దులిల్లాహ్, మన దేశాల్లో ఈ ఆచారం సాధారణంగా కనిపించకపోయినా, కొన్ని ముస్లిం సమాజాల్లో ఇటువంటి "విడాకుల వేడుకలు" కనిపించడం ప్రారంభమైంది. అంతేకాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఈ తరహా ఆచారాలకు ప్రచారం లభిస్తోంది.

కాబట్టి ముస్లిం కుటుంబాలు ఇలాంటి ఆచారాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వివాహం సంతోషంతో ప్రారంభమైనట్లే, విడిపోవాల్సి వచ్చినా అది ద్వేషం, అవమానం, ప్రతీకారం, ఆడంబరాలకు కాకుండా – మర్యాద, క్షమ, హక్కుల పరిరక్షణ, పిల్లల పట్ల కరుణతో ముగియాలి.

**ఓ అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన విశ్వాసులారా!**

నిశ్చయంగా వివాహం మరియు విడాకులు మానవ జీవితంలోని అత్యంత ముఖ్యమైన వ్యవహారాలలో కొన్ని. అందుకే ఇస్లాం ఈ రెండింటినీ మనిషి కోరికలకు, మారుతున్న ఆచారాలకు, సమాజపు ఒత్తిళ్లకు వదిలిపెట్టలేదు.

వీటి విషయంలో ధర్మాన్ని కాపాడే, కుటుంబాన్ని సంరక్షించే, మానవుల మేలును సాధించే స్పష్టమైన నియమాలను ఇస్లాం నిర్దేశించింది.  ప్రజలలో ఉన్న  ఆచారం అయితే అల్లాహ్ శరీఅత్‌కు అనుగుణంగా ఉంటుందో, అది ప్రశంసనీయమైనదే; దానిని గౌరవించవచ్చు. అయితే ఏ ఆచారం అల్లాహ్ ఆదేశాలకు, ఆయన ప్రవక్త ﷺ మార్గదర్శకత్వానికి విరుద్ధంగా ఉంటుందో, ప్రజలు తరతరాలుగా ఆచరిస్తున్నప్పటికీ దానికి ఇస్లాంలో ఎలాంటి ప్రాముఖ్యత లేదు.

## యువతపై భారాన్ని తగ్గించండి

కాబట్టి, అల్లాహ్ దాసులారా! మీ యువతపై భారాన్ని తగ్గించండి. వారికి వివాహం ద్వారా పవిత్రమైన, గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించే మార్గాలను సులభతరం చేయండి. అల్లాహ్ వారికి విధించని ఖర్చులను, మీరు కూడా వారిపై విధించకండి. వివాహాన్ని ఆడంబరాలు, అనవసరమైన ఖర్చులు, పోటీలు, ప్రదర్శనలతో కష్టతరం చేయకండి. యువతకు వివాహం సులభమైతే, సమాజంలో పవిత్రత, నీతి, కుటుంబ స్థిరత్వం బలపడతాయి.

## విడాకులు సంభవించినప్పుడు కూడా మంచితనమే మార్గం

అలాగే, ఎప్పుడైనా విడాకుల పరిస్థితి ఏర్పడితే, అది కూడా మంచితనంతో, మర్యాదతో జరగాలి; ప్రతీకారం, కక్ష, అవమానం లేదా పగతో కాదు. భార్యాభర్తల మధ్య ఒకప్పుడు ఉన్న ప్రేమ, అనురాగం, అనుబంధాన్ని పూర్తిగా మరచిపోకూడదు. విడిపోవాల్సిన పరిస్థితి వచ్చినా, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడాలి.అందుకే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلَا تَنْسَوُا الْفَضْلَ بَيْنَكُمْ

“మీ మధ్య ఉన్న పరస్పర మంచితనాన్ని మరచిపోవద్దు.” (అల్-బఖరహ్: 237)

ఎంత గొప్ప మార్గదర్శకం ఇది!

వివాహ బంధం కొనసాగకపోయినా, మంచితనం మాత్రం ముగియకూడదు. బంధం తెగిపోయినా, మానవత్వం తెగిపోకూడదు. భార్యాభర్తలు విడిపోయినా, గతంలో ఒకరికి ఒకరు చేసిన మేలును తుడిచివేయకూడదు.

అల్లాహ్! ముస్లింల ఇళ్లను సంస్కరించు. భార్యాభర్తల హృదయాల మధ్య ప్రేమ, అనురాగం, కరుణలను కలిగించు.

ఓ అల్లాహ్! మాపై ఉంచబడిన అమానత్ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడానికి మాకు సహాయం చేయి. మమ్మల్ని ద్రోహం, మోసం, నమ్మకద్రోహం నుండి దూరంగా ఉంచు.

ఓ అల్లాహ్! నీ హలాల్ ద్వారా మమ్మల్ని హరామ్‌కు దూరంగా ఉంచు. నీ అనుగ్రహంతో నిన్ను తప్ప మరెవరి అవసరం లేకుండా మమ్మల్ని సమృద్ధులుగా చేయి.

ఓ అల్లాహ్! విశ్వాసాన్ని మా హృదయాలకు ప్రియమైనదిగా చేయి. దానిని మా హృదయాలలో అందంగా అలంకరించు. అవిశ్వాసాన్ని, పాపాచారాన్ని, అవిధేయతను మాకు అసహ్యమైనవిగా చేయి. మమ్మల్ని సన్మార్గాన్ని అనుసరించే వారిలో చేర్చు.

ఓ అల్లాహ్! ఇస్లామును మరియు ముస్లింలను గౌరవంతో బలపరచు. షిర్క్‌ను, ముష్రికులను అణగదొక్కు. కపటత్వాన్ని, కపటులను నిరుత్సాహపరచు. నీ ధర్మానికి, నీ గ్రంథానికి, నీ ప్రవక్త ﷺ సున్నత్‌కు, నీ విశ్వాసపూర్వక దాసులకు సహాయం ప్రసాదించు.

ఓ అల్లాహ్! ముస్లిం పురుషులను, ముస్లిం స్త్రీలను; విశ్వాసులైన పురుషులను, విశ్వాసులైన స్త్రీలను—వారిలో జీవించి ఉన్నవారిని, మరణించినవారిని—అందరినీ క్షమించు.

ఓ అల్లాహ్! మా అమీరును, ఆయన యువరాజును నీ మార్గదర్శకత్వానికి అనుగుణంగా నడిపించు. వారి కార్యాలను నీ విధేయతకు, నీ ప్రసన్నతకు కారణమయ్యేలా చేయి.

ఓ అల్లాహ్! ఈ దేశాన్ని శాంతి, భద్రత, సుఖసంతోషాలతో నిండిన దేశంగా చేయి. దీనిని భద్రత, విశ్వాసాలకు నిలయంగా చేయి. అలాగే సమస్త ముస్లిం దేశాలన్నింటినీ శాంతి, భద్రత, సౌభాగ్యాలతో వర్ధిల్లేలా చేయి.

**శుక్రవారం నమాజు కోసం నమూనా ఖుత్బా తయారీ కమిటీ**